క్లుప్తంగా

బైక్ ఢీ.. ఒకరికి గాయాలు



టేకుమట్ల : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పంగిడిపల్లి గ్రామానికి చెందిన శివరాం కుమార్ తన బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం రాఘవరెడ్డిపేట వైపు వెళ్తున్నాడు. కాగా రాఘవరెడ్డిపేట నుంచి టేకుమట్ల వైపు అతివేగంతో వస్తున్న గుర్తు తెలియని ద్విచక్రవాహనం శివరాంకుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. వెంటనే స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. పైలట్ కట్కూరి శ్రీనివాస్, ఈఎంటీ రాజు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న సారయ్య దంపతులు

మల్హర్ : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో అన్సాన్‌పల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అన్సాన్‌పల్లికి చెందిన జాటోత్ సారయ్య రోజు మాదిరిగానే తన ఎడ్లను వ్యవసాయ పొలానికి మేతకు తీసుకెళ్లాడు. పొలంలో మేత మేస్తున్న ఎద్దు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో అక్కడికక్కడే మృత్యువాత పడింది. ఎద్దు విలువ రూ.60వేలు ఉంటుందని బాధితుడు సారయ్య వాపోయారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.

విద్యుదాఘాతంతో పాడిగేదె..



మృతిచెందిన పాడిగేదె

వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలో ఉడుత రవికి చెందిన పాడిగేదె శనివారం విద్యుదాఘాతంతో మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మురుగు నీరు నిల్వ ఉండడంతో పాటు ఎర్త్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై పాడిగేదె మృతిచెందిందని బాధితుడు రవి తెలిపాడు. గేదె మృతిచెందడంతో రూ.50వేల నష్టం వాటిల్లిందని రవి ఆవేదన వ్యక్తం చేశాడు.

గుట్టుగా తవ్వేస్తున్నారు!

- పొక్లెయినర్, ట్రాక్టర్ యజమానులతో కుమ్మక్కు
- అక్రమంగా మొరం తరలింపు
- పట్టించుకోని అధికారులు



బోయినిపల్లి శివారులో మొరం తరలించిన గుట్ట

టేకుమట్ల : గుట్టుచప్పుడు కాకుండా ధనార్జనే ధ్యేయంగా కొంతమంది అక్రమార్కులు గుట్టలను తవ్వి మొరాన్ని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని బోయినిపల్లి, బూర్నపల్లి, గర్మిళ్లపల్లి, వెంకట్రావ్‌పల్లి గుట్టల్లో అక్రమంగా పొక్లెయినర్లను ఉపయోగిస్తూ ట్రాక్టర్లలో మొరాన్ని తరలిస్తున్నారు. నిత్యం ప్రభుత్వ భూములు, గుట్టలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు ఉదాసీనంగా ఉండడంపై ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రభుత్వ పనులు, అంతర్గత రోడ్ల పేరుతో మొరాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్, ట్రాక్టర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఇష్టారీతిగా తవ్వకాలు..

అక్రమంగా మొరం తరలింపును పట్టించుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా గుట్టలే మాయమతున్నాయి. గుట్టల్లో మొరం తవ్వకాల వల్ల భూస్వరూపాన్ని కోల్పోవడంతో పాటు, చెట్లు, అటవీ సంపద కనుమరుగు అవుతున్నాయి. ప్రకృతి సంపదన భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉన్న ఇష్టారాజ్యాంగ తవ్వకాలు చేపడుతున్నారు. నిబంధనల మేరకు మొరం తవ్వకాలు చేపట్టేందుకు అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. కానీ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ గుట్టు చప్పుడు కాకుండా గుట్టనే తవ్వేస్తున్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మొరం తవ్వకాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



ప్రకృతి సిద్ధమైన వనరులను కొంత మంది అక్రమార్కులు ఇష్టారాజ్యాంగ తవ్వకాలు చేపడుతూ మొరాన్ని తరలిస్తున్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎక్కడ పడితే అక్కడి గుట్టలను మాయం చేస్తున్నారు. అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకొని సహజ సంపదను కాపాడాలి. కొంతకాలం నుంచి అక్రమంగా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. చెట్లను సైతం నరికి వేస్తున్నారు.

- గువ్వాడి లక్ష్మణ్, ఆరెపల్లి

సంస్థ అభివృద్ధికి కృషి చేయాలి

- ఏరియా జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి



కారుణ్య నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం

భూపాలపల్లి అర్బన్ : సింగరేణిలో కారుణ్యం ద్వారా ఉద్యోగంలో చేరుతున్న ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి అంకిత భావంతో పని చేయాలని ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. ఏరియాలో నూతనంగా ఉద్యోగంలో చేరిన వారికి శనివారం కారుణ్య నియమాక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సంస్థలో చేరుతున్న వారు క్రమశిక్షణతో పని చేయాలని కోరారు. మహిళా కార్మికులు భూగర్భ గనుల్లో విధులు నిర్వహించేందుకు సంసిద్ధగా ఉండాలన్నారు. సంస్థలో యువశక్తి పెరుగుతోందని, రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వ్యసనాలకు దూరంగా ఉండి కుటుంబ సభ్యులతో కలిసి ఉండాలని సూచించారు. తల్లిదండ్రుల త్యాగాలను వృథా కానివ్వొద్దని సీనియర్ కార్మికులతో కలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికార ప్రతినిధి మారుతి, సెక్యూరిటీ అధికారి మురళిమోహన్, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు రమేష్, బొడ్డు అశోక్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎస్సైకి విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

టేకుమట్ల : సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణతోపాటు భద్రత కూడా ఉంటుందని ఎస్సై దాసరి సుధాకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని రాఘవాపూర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయొచ్చని తెలిపారు. అనుమానితులు గ్రామాల్లో సంచరించినప్పుడు గుర్తు పట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని వివరించారు. గ్రామాల్లో ఏదైనా సంఘటన జరిగినప్పుడు కేసును ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని సూచించారు. గ్రామ ప్రారంభం, చివర, ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్తులు, ఆర్‌ఎంపీలు, ఉద్యోగులు, ట్రాక్టర్ యజమానులు, రైతులు సహకరించాలని కోరారు. ఈసందర్భంగా కొంత మంది గ్రామస్తులు రూ.50 వేల విరాళం అందించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వెంకటేష్, నాగరాజు, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్‌కు నివాళి



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న స్థానికులు

ములుగు రూరల్ : భారత సరిహద్దులో జరిగిన ఎదురు కాల్పుల్లో వీర జవాన్ మురళి నాయక్ మృతి చెందాడు. కాగా ములుగు మండలంలోని కాసిందేవి పేట గ్రామంలో ఆర్మీ జవాన్ ఎన్నిండ్ల ప్రశాంత్ ఆధ్వర్యంలో స్థానికులు మురళి నాయక్ మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరం



ములుగు : బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్ననాయక్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని బరిగాలనిపల్లి గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్, తిరుపతిరావు ప్రజలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. బీపీ, షుగర్ టెస్టులు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ శిబిరానికి వృద్ధులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ నవీన్, ఏఎస్ఎం మౌనిక, మెపా జిల్లా అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, విక్రం యాదవ్, మట్టెవాడ రాజు, సురేందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాంచారమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

వెంకటాపురం(ఎం) : మండలంలోని రామాంజాపూర్‌లో రేపటినుంచి జరగబోయే నాంచారమ్మ జాతరకు మంత్రి సీతక్క హాజరుకానున్నారు. దీంతో జాతరలో జరుగుతున్న ఏర్పాట్లను స్థానిక ఎస్సై జక్కుల సతీష్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. జాతర కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు. భక్తి శ్రద్ధలతో నాంచారమ్మ జాతరను జరుపుకోవాలని, పోలీసుల బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ లోకిని రాజు, నాయకులు కేతిరి భిక్షపతి, పల్లకొండ భాస్కర్, రాజు, శ్రీనివాస్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

తునికాకు కూలీని ఆదుకోవాలి

ఏటూరునాగారం : గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి గ్రామానికి చెందిన చింత చంద్రకళ తునికాకు సేకరణకు వెళ్లి ఇటీవల విషపూరిత పాముకాటుకు గురైంది. ఇందుకు అటవీశాఖ పూర్తి బాధ్యత వహించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని నాయకపోడు పొలిట్‌బ్యూరో సభ్యుడు బొల్లెం సారయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో నాయకపోడు సంఘం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింత చంద్రకళ తునికాకు సేకరణకు వెళ్లి పాముకాటుకు గురైందని, ఆమె ప్రాణప్రాయ స్థితిలో విషమంగా ఉందన్నారు. ఆమెను ఆదుకొని బాధిత కుటుంబానికి అండగా అటవీశాఖ, తునికాకు కాంట్రాక్టర్లు నిలవాలని డిమాండ్ చేశారు.

అట్రాసిటి కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు, బాధితులు

కాటారం : మహాముత్తారం మండలం బోర్లగూడెంలో వారంక్రితం ఎస్టీ నాయకపోడు తెగకు చెందిన గుండం సాగర్‌పై దాడి చేసిన అదే గ్రామానికి చెందిన బీసీ కులానికి చెందిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు రామినేని సురేందర్, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డిని కలిశారు. దాడికి సంబంధించిన వివరాలను వారు డీఎస్పీకి వివరించినట్లు తెలిపారు. దాడి జరిగిన రోజే మహాముత్తారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఎఫ్ఐఆర్ పరిశీలిస్తే ఎక్కడ కూడా దాడి చేసి కులం పేరుతో దూషించిన అంశాన్ని పోలీసులు ప్రస్తావించ లేదని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. డీఎస్పీ పూర్తి వివరాలు తెలుసుకుని బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు సురేందర్, రాజేందర్ పేర్కొన్నారు.

అడవికి నిప్పు పెట్టొద్దు



కూలీలకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మణ్

- తాడిచర్ల సెక్షన్ అధికారి లక్ష్మణ్

మల్హర్ : అడవికి నిప్పు పెడితే కఠిన చర్యలు తప్పవని తాడిచర్ల ఫారెస్ట్ సెక్షన్ అధికారి గోడు లక్ష్మణ్ పేర్కొన్నారు. మండలంలో మల్లారం సెక్షన్ పరిధి అటవీ ప్రాంతంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు శనివారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. పని ప్రదేశంలో సిగిరేట్, బీడీ, చుట్టాలు కాల్చినా, అగ్గిపుల్లలు ఎండిన ఆకులపై పడితే అడవి కాలిపోవడం జరుగుతుందన్నారు. అడవి కాలిపోవడం వల్ల వన్య ప్రాణులు మృత్యువాత పడే ప్రమాదం ఉందన్నారు. అలాగే వన్య ప్రాణలను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎడపల్లిలో పోలీసుల గ్రామసందర్శన



గ్రామ సందర్శనలో మాట్లాడుతున్న పోలీసులు

కాళేశ్వరం : మహదేవపూర్ మండలంలోని ఎడపల్లిలో శనివారం పోలీసులు గ్రామసందర్శన నిర్వహించారు. పీఎస్సై సాయిశశాంక్ గ్రామంలోని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు కనిపించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. యువత మాదకద్రవ్యాలు, గుడుంబా వైపు అలవాటు పడకుండా ఉండాలని సూచించారు. ఎవరైనా వాటిని విక్రయించినట్లయితే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసులు తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు చేయాలి

- సీఐటీయూలో చేరిన రైస్‌మిల్ డ్రైవర్లు



సీఐటీయూలోకి ఆహ్వానిస్తున్న రాజేందర్

ములుగు రూరల్ : కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్య పోరాటాలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ అన్నారు. వివిధ రైస్ మిల్లుల్లో పనిచేస్తున్న రైస్ మిల్ డ్రైవర్లు 40 మంది శనివారం రాజేందర్ సమక్షంలో సీఐటీయూలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం సీఐటీయూ కార్యాలయంలో బొచ్చు మొగిలి అధ్యక్షతన జరిగిన రైస్ మిల్ డ్రైవర్స్ యూనియన్ సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ కార్మికులు తమ హక్కుల సాధనకు సీఐటీయూలో చేరడం ద్వారా కార్మిక వర్గ పోరాటాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు. రైస్ మిల్లు డ్రైవర్లకు పని భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా హెల్త్ ఇన్సూరెన్, ప్రమాద బీమా వంటి సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. రైస్ మిల్లులో పనిచేసే ప్రతి కార్మికుడికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో రైసు మిల్లు డ్రైవర్లు కూడా భాగస్వామ్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి సద్దాం హుస్సేన్, కలువల రవీందర్, రైస్ మిల్ డ్రైవర్లు సూదమల్ల శివకుమార్, మామిడి రవి, సిలువేరు రమణాకర్, ఎనగందుల శ్రీకాంత్, మామిడి సంపత్ ,బొచ్చు రవీందర్, దూడపాక రఘుపతి, తిక్క రమేష్, ఈర్ల రాజు, మేడిపల్లి సూరయ్య, తిక్క రఘు,, బోడ శంకరయ్య, సారయ్య, మామిడి కుమారస్వామి, రోడ్డ గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రేగొండ : కొత్తపల్లిగోరి మండలం విజ్జయ్యపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ క్రియాశీలక కార్యకర్త జక్కుల శ్రీనాథ్ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ పార్టీ తరుపున రూ.2 లక్షల సభ్యత్వం చెక్కును మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణా రెడ్డి శనివారం అందజేశారు. భవిష్యత్‌లో బాధిత కుటుంబానికి అండగాఉంటామని హమీ ఇచ్చారు. మాజీ సర్పంచ్ ఐ లయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని నర్సింహాసాగర్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు బెల్లి కుమార్ అనారోగ్యంతో మృతిచెందాడు.కాగా బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు శనివారం పరామర్శించి రూ.20,000ల నగదును అందజేశారు. నర్సింహాసాగర్‌లో జరిగిన మృతుడి దశదిన కర్మకు జిల్లా నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, తాటి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, హాజరై కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తోట రమేష్, కాడబోయిన నరేందర్, ఊడుగుల శ్రీనివాస్, తుమ్మ మల్లారెడ్డి, కొమరం ధనలక్ష్మి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సంత.. తప్పని చింత



రోడ్డుపై నిర్వహిస్తున్న సంత



దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్న వ్యాపారస్తులు

- రోడ్డు పైనే దుకాణాల నిర్వహణ
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

వెంకటాపురం(కె) : ప్రతి మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసే సంత నిర్వహణకు ఇబ్బందులు తప్పడం లేదు. సంత నిర్వహించేందుకు సరిపడ వనరులు ఉన్నా, వసతుల లేమితో కొట్టు మిట్టాడుతోంది. దీంతో రోడ్డుపై సంత నిర్వహిస్తుండడంతో ప్రజలు, వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సంత నిర్వహణకు వ్యాపారుల నుంచి ప్రతి ఏటా సుమారు లక్షల వరకు నిధులు గ్రామ పంచాయతీకి ఆదాయం చేకూరుతున్న అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. మండలంలోని గిరిజనులు, గిరిజనేతరులు, గ్రామాల్లో దుకా ణాలు నడిపే వారు అధిక సంఖ్యలో వచ్చి సంతలో సరుకులు కొనుగోలు చేస్తుంటారు. వారమంతా కష్టపడే గిరిజనులకు ఈ సంత ఆదాయ వనరుగా మారుతోంది. అడవుల్లో దొరికే చీపుర్లు ఇతర ఉత్పత్తులను గిరిజనులు అంగట్లో అమ్ముకుని తమకు కావలిసిన వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. తమ పొలాల్లో పండించిన చిరుధాన్యాలను రైతులు సైతం సంతలో విక్రయిస్తుంటారు. ప్రతి మంగళవారం జరిగే ఈ సంతలో సుమారు రూ.3నుంచి రూ.4లక్షల వరకు వ్యాపారం సాగుతుంది.

రోడ్డుపైనే వ్యాపారం

ప్రతి మంగళవారం బస్టాండ్ సెంటర్లో ప్రధాన రహదారిపై సంత నిర్వహిస్తుడటంతో ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులు పడుతూ అసౌకర్యానికి గురవుతున్నారు. వ్యాపారులు చిన్నచిన్న టెంట్లు ఏర్పాట్లు చేసుకొని వస్తువులను విక్రయిస్తుంటారు. వర్షాకాలంలో వ్యాపారస్తుల బాధలు వర్ణనాతీతంగా ఉంటాయి. వర్షానికి సరుకులు తడిసి నష్టపోతున్నారు. సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. షెడ్ల నిర్మాణం చేపడితే వ్యాపారులు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.ఇప్పటికై నా అధికారులు స్పందించి సంతకు ప్రత్యేక స్థలం కేటాయించి షెడ్లు నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు.

ప్రత్యేక స్థలం కేటాయించాలి



వెంకటాపురం మండల కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే వారసంతకు పంచాయతీ అధికారలు ప్రత్యేక స్థలం కేటాయించాలి. రోడ్లపై సంతను (అంగడి) నిర్వహించడం వల్ల వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ప్రసాద్, వెంకటాపురం


రోడ్లపై దుకాణాలు పెట్టకుండా చూడాలి



ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంతలో దుకాణాలను రోడ్డుకు ఇరువైపులా పెట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. రోడ్డు పక్కన దుకాణాలు పెట్టడం వల్ల వివిధ పనులపై వచ్చిపోయే వారు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.దీనికి తోడు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

- జక్కుల రమేశ్, వెంకటాపురం

సైన్యానికి మద్దతుగా పూజలు



పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారులు

కాటారం : భారత్–పాకిస్తాన్ యుద్ధంలో భారత్‌కు విజయం వరించాలని వేడుకుంటూ మండలంలోని బొప్పారం హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ మాలధారులు ప్రత్యేక పూజలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో వీరోచితంగా పోరాడుతున్న త్రివిధ దళాలకు, సైన్యానికి వారు సంఘీభావం తెలిపారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న ప్రతి సైనికుడికి భారత ప్రజలు రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.